క్లుప్తంగా

ఓటు నమోదు శాతం పెంచాలి



మరిపెడ: ఓటు నమోదు శాతాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మరిపెడలో తొర్రూర్ డీఎస్పీ వెంకటేశ్వరబాబుతో కలిసి మరిపెడలో శనివారం ఉదయం 5కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల్లో ఓటర్లను చైతన్యవంతులను చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంపీడీఓ ధన్‌సింగ్, పాల్గొన్నారు. 5కే రన్‌లో పాల్గొన్న విజేతలకు ప్రథమ బహుమతి గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన చందా విశాల్ రూ.10వేలు గెలుచుకున్నాడు. ద్వితీయ బహుమంతి రూ. 6వేలు, తృతీయ బహుమతి రూ.4వేలు అందజేశారు.

శ్రావణమాస పూజలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో శ్రావణ మాస పూజావేడుకల్లో భాగంగా శనివారం ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సహ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమ ఇండ్ల వద్ద నుంచి తులసి మాలలను తయారు చేసుకుని తీసుకువచ్చి ఆలయంలో సమర్పించారు.

నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయాలి



కేసముద్రం: నూతనరేషన్ కార్డులను మంజూరు చేయకపోవడంతో పేద ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య, పిన్నోజు బాలాచారి, జూకంటి రవి, శ్రీను, ఉపేందర్, రాజు పాల్గొన్నారు.

22న పీఈటీల సమావేశం

కురవి: ఈనెల 22వ తేదీన జెడ్పీ హైస్కూల్‌లో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం ఉంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈఓ రామారావు ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా క్రీడలు నిర్వహణ, మండల, జోనల్ కార్యదర్శి ఎంపిక, క్రీడా నిర్వహణ బడ్జెట్ తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని జెడ్పీ హైస్కూల్స్, ప్రభుత్వ కేజీబీవీ, మైనార్టీ, ఆశ్రమ, అన్ని రెసిడెన్షియల్ మోడల్ పీడీలు, పీఈటీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

యువత ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి

మరిపెడ: యువత ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబానికి ఆసరాగా నిలవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మండలం కేంద్రంలో గుండెపుడి గ్రామానికి చెందిన యువకుడు గుండగాని మధుసూదన్ వరంగల్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసుకున్న ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును మరిపెడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గుగులోతు సింధూరతో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కుడితి మహేందర్‌రెడ్డి, ఉప్పల కృష్ణమూర్తి, కౌన్సిలర్లు సుజాత వెంకన్న, లలిత వెంకటేశ్వర్లు, హాతిరామ్, బయ్య భిక్షం, కౌసల్యగణేష్, బోడ శ్రీను, కోటేష్ పాల్గొన్నారు.

మొక్క చెట్టయింది



చెట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డోర్నకల్: నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాటిన మొక్క నేడు వృక్షంగా మారింది. గొల్లచర్ల ఎంపీటీసీ సభ్యులు బానోత్ శంకర్ 2019 డిసెంబర్ 20న ఎమ్మెల్యే రెడ్యానాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని కస్నాతండాలోని తన ఇంటి ఆవరణలో వేప మొక్కను నాటాడు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మొక్క నాటుతున్నట్లు బోర్డుపై రాసి పెట్టాడు. శనివారం తండాలో పర్యటించిన ఎమ్మెల్యే వేప చెట్టుకు తన పేరుతో బోర్డు తగిలించి ఉండటంతో విషయం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశాడు.

గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ సరికాదు

నెహ్రూసెంటర్: హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో అర్ధరాత్రి గిరిజన మహిళ లక్ష్మిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరినాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ భీమానాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళ కొట్టడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై పోలీసుల తీరు సరికాదన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే మహిళపై పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి, థర్డ్ డిగ్రీ ఉపయోగించడం ఏంటని ప్రశ్నించారు. మహిళపై దాడికి పాల్పడిన పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ తేజావత్ వినోద్ నాయక్, జిల్లా అధ్యక్షుడు బానోత్ మంగిలాల్, ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ శివవర్మనాయక్, నాయకులు బానోత్ విష్ణు, దేవ్‌జీ, సోముజీ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న హరినాయక్



కురవి: మాట్లాడుతున్న కిషన్‌నాయక్

పోలీసులపై చర్య తీసుకోవాలి

కురవి: మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి గాయపరిచిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకుని, ఎస్టీ, ఎస్సీ యాక్టు కింద కేసు నమోదు చేయాలని, వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కిషన్‌నాయక్, రాజునాయక్, హనుమానాయక్, మంగీలాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

హామీలన్నీ అమలు చేశా..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్: ఆరుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని పాతదుబ్బతండా, కస్నాతండా, బోరింగ్‌తండా, అమ్మపాలెం, తహసీల్‌దారుబంజర, సీతారాంపురం బంజర గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే నిలదీసే హక్కు ప్రజలకు ఉంటుందన్నారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు మంజూరు చేసి పనులు పూర్తయ్యే వరకు పర్యవేక్షిస్తానని తెలిపారు. అభివృద్ధి పనులు చేసి ప్రజల రుణం తీర్చుకుంటున్నానన్నారు. ప్రజలు ఓటేసి రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, సర్పంచులు మూడ్ జామ్రి, బానోత్ రాంబాయిమంగీలాల్, దరంసోత్ రాంబాయిశంకర్, అంకతి సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యులు బానోత్ శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ గొర్ల సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని ఆందోళన

బయ్యారం: మండలంలోని మిర్యాలపెంట పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ శనివారం విద్యార్థులు, స్థానికులు ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల ఎదుట నిర్వహించిన ఆందోళనను ఉద్దేశించి స్థానికులు మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యాబోధన నిర్వహిస్తున్న పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడే ఉండటం వలన పిల్లలకు నాణ్యమైన విద్య అందదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా పనిచేయాల్సిన ఉపాధ్యాయురాలిని ఇతర ప్రాంతానికి ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని లేని ఎడల ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గలిగె వెంకన్న, స్థానికులు రామకృష్ణ, ఝాన్సీరాణి, అమ్మక్క, రజిత, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు, స్థానికులు

కలెక్టర్ కార్యాలయం నుంచి నోటీసులు

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలో వీఆర్‌ఏ పోస్టు న్యాయబద్ధంగా రావాలని బాధితుడు ఎస్‌కె సలీం ఇటీవలే జిల్లా కేంద్రంలో జరిగిన వీఆర్‌ఏలకు వివిధ శాఖలల్లో కేటాయించిన ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఐదేళ్ల తర్వాత యాకూబ్ పాషాను ఏ పద్ధతిన విధుల్లోకి తీసుకుంటారని మంత్రి సత్యవతిరాథోడ్ సమక్షంలో పెట్రోల్ పోసుకుని సలీం ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన తెలిసిందే. దీంతో ఇద్దరికి మీ వద్ద ఉన్న ఆధారాలతో ఈ నెల 21న సోమవారం కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని శనివారం నోటీసులు జారీ అయ్యాయి.

అభివృద్ధి పనులు అడ్డుకోవద్దు



ఎఫ్‌ఆర్వోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాల్లో మంజూరైన అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని అటవీశాఖ అధికారులను ములుగు ఎమ్మెల్యే సీతక్కను కోరారు. శనివారం అటవీ క్షేత్రాధికారి వజ్రహత్‌తో తన కార్యాలయంలో మాట్లాడారు. కొత్తగూడ నుంచి దుబ్బగూడెం, భూపతిపేట నుంచి కొత్తగూడ, కొత్తపల్లి నుంచి ఓటాయి క్రాస్ రోడ్డు వరకు మంజూరైన రోడ్డు పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. డీఎల్‌సీలో అనుమతి పొందిన రోడ్లను అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. రోడ్లు సరిగా ఉంటే ప్రజలైనా, అధికారులైనా గ్రామాలకు వెళ్లగలుగుతారన్నారు. అందుకు శాఖాపరంగా సహకరించాలని కోరారు. కొందరు కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులను తప్పుతోవ పట్టించే అవకాశాలు ఉన్నాయన్నారు. స్పందించిన ఎఫ్‌ఆర్వో డీఎల్‌సీలో అనుమతులు వచ్చిన పనులను అడ్డుకోబోమని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, వైస్‌ఎంపీపీ జంపయ్య, సర్పంచ్ రణధీర్ ఉన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అభివృద్ధి



ప్రార్థనలో పాల్గొన్న అధికారి చంద్రశేఖర్ ఆజాద్

మహబూబాబాద్ రూరల్: పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా మండలంలోని వేమునూరు ఎంపీయూపీఎస్ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో జరిగే ప్రేయర్‌కు హాజరై పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రాముఖ్యతను తెలియజేశారు. పెసర బండ తండా ఎంపీపీఎస్‌ను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాలు, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ గురించి ఆరా తీసి అందరూ తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాల అభివృద్ధిలో తోడ్పడుతుందని తెలియజేశారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, సదానందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

మహబూబాబాద్: గృహలక్ష్మి దరఖాస్తుదారులు అధికారులకు అన్నివిధాలా సహకరించాలని స్పెషల్ ఆఫీసర్ అనిల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 26వార్డులో శనివారం వర్షంలో అధికారులు గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్, వార్డు ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, వీఆర్‌ఏ యుగేందర్, ఆర్పీ సరిత పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సింగరావు కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు.

నర్సింహులపేట: ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు అందిస్తున్న గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సింహపురం బంజరలో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలించారు. వంతడపల గ్రామంలో తహసీల్దార్ వివేక్, నర్సింహులపేటలో పీఆర్ డీఈ నర్సింగ్‌నాయక్ ఇళ్లను పరిశీలించారు.



మహబూబాబాద్: దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

మధుర జ్ఞాపకాలను గుర్తు చేసేదే ఫొటో

గూడూరు: మండల కేంద్రంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫొటో కెమెరా సృష్టికర్త లూయీస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు చెన్నబోయిన లక్ష్మణ్, రాష్ట్ర అసోసియోషన్ ఉపాధ్యక్షుడు అయినవోలు బాలచందర్, ప్రభాకర్, సురేష్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

తొర్రూరు: పెరిగిన టెక్నాలజీతో దెబ్బతిన్న ఫొటో గ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేరుగు కర్ణాకర్ కోరారు. సంఘం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా తరుణి అధ్యక్షురాలు వజినెపల్లి శైలజ ఆధ్వర్యంలో మండలంలోని ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మాచర్ల వెంకన్న, నాయకులు దేవరకొండ కృష్ణప్రసాద్, కాసర్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రపంచ ఫొటో గ్రాఫర్ల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్లు సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి చేతుల మీదుగా జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు.

మరిపెడ: ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఫక్రుద్దీన్, బాదావత్ భద్రు, జాటోతు నరేష్, లింగన్న, గంధం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మధురమైన జ్ఞాపకాలను కలకాలం గుర్తు చేసేది ఒక్క ఫొటో మాత్రమే అని దంతాలపల్లి ఫొటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడు చామకూరి రాము అన్నారు. మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించి, డాగురే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు యండి ఇమామ్, సోమేష్, సైదులు, యాకన్న, మధు పాల్గొన్నారు.



మరిపెడ: లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు



గూడూరు: ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు



తొర్రూరులో సన్మానం పొందిన ఫొటోగ్రాఫర్లు

సంఘ విద్రోహ శక్తులకు సహకరించొద్దు



వాలీబాల్ కిట్ అందజేస్తున్న సీఐ

గార్ల: గ్రామాల్లోని యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని గార్ల బయ్యారం సీఐ కోట బాబూరావు సూచించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండలంలోని మారుమూల గ్రామమైన బాలాజీతండాలో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయం అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం ఓటీపీ వివరాలు ఎవ్వరికీ చెప్పవద్దన్నారు. యువకులు చెడు అలవాట్లను వీడి సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని సూచించారు. సమావేశం అనంతరం యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ శంకర్, ఎంపీటీసీ నాగరాజు, ఎస్సై బానోత్ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మూఢనమ్మకాలతో మోసపోవద్దు

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు మూఢనమ్మకాలతో మోసపోవద్దని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని బొడ్లాడ గ్రామంలో శుక్రవారం మూఢనమ్మకాలపై కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశ్మగౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, సతీస్ కళాబృంద సభ్యులు, కానిస్టేబుళ్లు ప్రకాష్‌రెడ్డి, వెంకటయ్య, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులో మంత్రి కేటీఆర్ ప్రారంభించిన ఉక్కు వంతెన కార్యక్రమంలో జిల్లాకు చెందిన జానపద కళాకారులు కొమ్మురాజుల వెంకన్న, జిల్లెల సాయికుమార్, రేపాక రేణుక, సరిత, బీరపాటి శివ, మల్లెపాక హుస్సేన్, పదిర నాగమణి, మన్నెం యాకమ్మ, అమరాజు బిందు శనివారం పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా రమేష్

గార్ల: మరిపెడ బంగ్లా ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా గార్ల మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన బానోత్ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ శనివారం తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

గార్ల: గార్ల మండల రైల్వే ప్రయాణికుల సౌకర్యాల సాధన కమిటీని శనివారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కందునూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సత్రు, గౌరవ అధ్యక్షుడిగా ఆర్ విమల్‌కుమార్‌జైన్, ఉపాధ్యక్షులుగా జడ సత్యనారాయణ, జంపాల వెంకన్న, జి మురళి, శీలంశెట్టి రమేష్, గుండా వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా దనియాకుల రామారావు, రాధాకృష్ణ, కృష్ణారెడ్డి, అజ్మీర వెంకన్న, భాను ప్రచార కార్యదర్శిగా తాళ్లపల్లి కృష్ణ గౌడ్‌లతో పాటు మరికొందరిని గౌరవ సలహాదారులుగా ఎన్నుకున్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి



తొర్రూరు: గృహ సముదాయాల్లో సెల్ టవర్ల ఏర్పాటు సరికాదని పట్టణవాసులు పేర్కొన్నారు. పట్టణంలోని పదో వార్డులో గృహ సముదాయాల్లో సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శనివారం కాలనీ వాసులు నిరసన తెలిపారు. సెల్ టవర్ నిర్మాణాలు నిలిపివేయకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నిరసనలో స్థానికులు మంద యాకమల్లు, రాంరెడ్డి, రాజు, జగదీష్, రాములు, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం

బయ్యారం: మండలంలోని కొత్తపేట పంచాయతీలో స్వచ్ఛ కొతపేట పేరున బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు శనివారం శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాతా గణేష్, సర్పంచ్ మమత, ఉపసర్పంచ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రంగన్న పాత్ర మరువలేనిది

బయ్యారం: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో న్యూడెమోక్రసీ తరఫున నిర్వహించిన విప్లవోద్యమంలో అమరుడు చేపూరి రంగన్న పాత్ర మరువలేనిదని పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. శనివారం రంగన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, యుగంధర్, శేషు, మురళి పాల్గొన్నారు.

సన్మానం

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నుంచి మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలవడంతో గార్ల పుర ప్రముఖులు లోకో పైలట్లకు పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్లు తినిపించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌కుమార్ జైన్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు

గూడూరు: కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబాబాద్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలంటూ గూడూరు మండల కేంద్రానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ శనివారం గాంధీభవన్‌లోని కార్యాలయంలో దరఖాస్తును దాఖలు చేశారు.

పాఠశాలకు రోజూ వచ్చేలా చూడాలి

పెద్దవంగర: పిల్లలు పాఠశాలకు రోజూ వచ్చేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేశం, ఉపాధ్యాయులు రవి కుమార్, రత్నమాల పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో శనివారం పంచమ వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సీఐ బి.ఉపేందర్‌రావు ప్రారంభించారు.

మందిరం ఆస్తులను పరిరక్షిస్తాం

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌లోని రాధాస్వామి మందిరం ఆస్తులను పరిరక్షించడం తమ బాధ్యత అని రాధాస్వామి జనరల్ సత్సంగ్ చైర్మన్ వోలం చంద్రమోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాధాస్వామి మందిరం గోడలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరడంతో, కమిటీ తీర్మానం మేరకు ఇటీవల గోడలను కూల్చివేశామన్నారు. దీనిపై అవగాహన లేకపోవడంతో కమిటీపై లేనిపోని ఆరోపణలు వస్తున్నాయన్నారు. రాధాస్వామి మందిరం ఆస్తులను ఆక్రమణకు గురికాకుండా చూడటం తమ కమిటీ బాధ్యతన్నారు. దీనిపై తహసీల్దార్ నరేష్, ఎస్సై తిరుపతికి నివేదికను అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల శివకుమార్, కాముని వెంకట్రామయ్య, కన్నె యాకయ్య, రావుల మురళీ, గుగులోతు వీరునాయక్, బానోతు బాలునాయక్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వోలం చంద్రమోహన్

పీడీఎస్ బియ్యం పట్టివేత

కురవి: సీరోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కురవి మండలం మోద్గులగూడెం గ్రామంలో, అదే గ్రామ శివారులోని కమల పౌల్ట్రీ ఫాంపై సీరోలు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు చేసినట్లు సీరోలు ఎస్సై రమాదేవి తెలిపారు. ఎస్సై రమాదేవి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మోద్గులగూడెం శివారు కమల కోళ్ల ఫారంలో ఒక వ్యక్తి ఎక్స్‌ఎల్ వాహనం మీద నుంచి పీడీఎస్ బస్తాలు దింపుతుండగా అతన్ని పట్టుకుని విచారించినట్లు తెలిపారు. ఆ కోళ్ల ఫాం నుంచి ఎనిమిది బస్తాల పీడీఎస్ బియ్యంను సీజ్ చేసి శ్రీరామ్, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆమె వివరించారు. అలాగే మోద్గులగూడెం గ్రామంలో మల్లేశం అనే వ్యక్తి ఇంట్లో ఎనిమిది బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని వివరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పూజలు



గూడూరు: మండలంలోని అయోధ్యపురంలో పురాతన గుడి ప్రాంతంలో చేపట్టిన తవ్వకాల్లో లభ్యమైన వేంకటేశ్వరస్వామి విగ్రహానికి శనివారం గ్రామస్తులు జలాభిషేక పూజలు నిర్వహించారు. అయోధ్యపురంలో గురువారం వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైన విషయం తెలిసిందే. జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత చేరుకొని తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో కల్సి పూజలు నిర్వహించి, రూ.1,116 లు ఆలయ నిర్మాణానికి తనవంతు విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు, అందుకు అవసరమైన నిబంధనలను గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాంనాయక్, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.